క్లుప్తంగా

టీషర్టులు పంపిణీ

బాసర: మండల కేంద్రంలోని రవిందాపుర్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం ఉపాధ్యాయురాలు రాధిక తన తండ్రి కేశవ్ మోహన్ జ్ఞాపకార్థం 30 మంది విద్యార్థులకు టీషర్టులు పంపిణీ చేశారు. తన పని చేస్తున్న పాఠశాలలో సర్పంచ్ లక్ష్మణరావు మాజీ సర్పంచ్ రమేశ్ చేతుల మీదుగా విద్యార్థులకు టీషర్టులు అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మమ్మయి శ్రీనివాస్, ఎస్ఎంసీ చైర్మన్ సంబాజీ, కృష్ణ జాదవ్, గురప్ప శంకర్, శివాజీ, అమూల్ తదితరులు పాల్గొన్నారు.

చైనా మాంజా విక్రయిస్తే కఠిన చర్యలు


దుకాణంలో తనిఖీ చేస్తున్న ఎస్సై శంకర్

ఖానాపూర్: గాలిపటాలను విక్రయించే దుకాణదారులు నిషేధిత చైనా మాంజాను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై శంకర్ అన్నారు. సోమవారం పట్టణంలోని పలు దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రమాదకరమైన చైనా మాంజాను ఎవరూ విక్రయించినా తమ దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. వారి వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

నర్సాపూర్(జి): మండలకేంద్రంలోని రైతువేదికలో మంగళవారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ రేఖ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ అల్లాడి వనజ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి సర్పంచులు, ఎంపీటీసీలు, ఆయా శాఖల అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

రేషన్‌బియ్యం పంపిణీ చేయాలి

ఖానాపూర్: ఈనెల 5న ప్రారంభం కావాల్సిన రేషన్‌బియ్యం పంపిణీ ప్రక్రియను నిలిపివేసిన ప్రభుత్వం.. తిరిగి వెంటనే ప్రారంభించాలని సదర్‌మాట్ రైతు సాధన సమితి అధ్యక్షుడు హపావత్ రాజేందర్ అన్నారు. సోమవారం స్థానిక విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం పేదలకు ఉచితంగా పంపిణీ చేసే రేషన్ బియ్యాన్ని సంక్రాంతి పండుగ వేళ రాష్ట్ర ప్రభుత్వం కావాలనే జాప్యం చేస్తుందని అన్నారు.

అతివేగం, అజాగ్రత్తతోనే రోడ్డు ప్రమాదాలు

ముధోల్: అతివేగం, అజాగ్రత్తతో వాహనదారులు రోడ్డు ప్రమాదాల బారిన పడుతున్నారని ముధోల్ సీఐ వినోద్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ముధోల్‌లో వాహనదారులకు అవగాహన కల్పించారు. తప్పనిసరిగా రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలన్నారు. ద్విచక్రవాహనంపై వెళ్లేవారు హెల్మెట్ ధరించాలని కోరారు. మద్యం తాగి, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనం నడపవద్దని సూచించారు. వాహనదారులు తమ వెంట అన్ని ధ్రువపత్రాలు ఉంచుకోవాలన్నారు.

మొసలి కలకలం


కుంట ఒడ్డున మొసలి

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ కుంటలో తిరుగుతున్న మొసలి సోమవారం ఒడ్డుకు వచ్చి చేరింది. దీంతో మొసలిని చూసిన స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇన్నిరోజులు మొసలి ఉందో లేదో తెలియక పలువురు కుంటలోకి దిగేవారు. సోమవారం మొసలి ఒడ్డుకు వచ్చి వచ్చి దృశ్యాన్ని ప్రత్యక్షంగా చూసిన వారంతా చెరువులోకి వెళ్లేందుకు జంకుతున్నారు. అధికారులు దృష్టి సారించి చెరువులో నుంచి మొసలి వెళ్లేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఉజ్జయిని పెన్షన్ కుంభమేళా



మేళాలో జిల్లా అధ్యక్షుడు కృష్ణారావు

నిర్మల్‌చైన్‌గేట్: నేషనల్ మూమెంట్ ఫర్ ఓల్డ్ పెన్షన్ స్కీం ఆధ్వర్యంలో మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఉజ్జయిని నగరంలో ఆదివారం నిర్వహించిన పెన్షన్‌కుంభమేళా బహిరంగ సభకు తెలంగాణ కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఉద్యోగుల సంఘం నిర్మల్ జిల్లా అధ్యక్షుడు కొండన్న గారి కష్టారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత పెన్షన్ ఇచ్చే పార్టీలకే ఓటు వేయాలని సంఘ సభ్యులు నిర్ణయించినట్లు తెలిపారు. ఇప్పటికే ఐదు రాష్ట్రాలు పాత పెన్షన్ అమలు చేస్తున్నాయని.. త్వరలోనే తెలంగాణ కూడా అదే బాటలో నడుస్తుందనే ఆశాభావం వ్యక్తం చేశారు.

జోరందుకున్న వరినాట్లు

- జిల్లాలో 90వేల ఎకరాల్లో సాగు చేస్తారని అధికారుల అంచనా
- బిహార్ కూలీలతో నాట్లు వేయిస్తున్న రైతులు
- ఇప్పటికే 25వేల ఎకరాల్లో పూర్తి


లక్ష్మణచాంద సమీపంలో వరినాట్లు వేస్తున్న బిహార్ కూలీలు

లక్ష్మణచాంద: వ్యవసాయ ప్రాంతంగా పేరుగాంచిన జిల్లాలోని ఆయా మండలాల్లో యాసంగి వరినాట్లు జోరందుకుంటున్నాయి. ఈసారి భారీగా వర్షాలు కురువడంతో చెరువులు, ప్రాజెక్టులు జలకళ సంతరించుకున్నాయి. సరస్వతి కాలువ, కడెం, స్వర్ణ, గడ్డెన్నవాగు ప్రాజెక్టుల ద్వారా యాసంగి పంటలకు సాగునీరు అందనుండటంతో గ్రామీణ ప్రాంతాల్లో వరినాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి.

జిల్లాలో 90వేల ఎకరాల్లో సాగు..

ఈసారి ప్రభుత్వం ఆంక్షలు పెట్టకపోవడం.. నీటి వనరులు పుష్కలంగా ఉండటం కూడా జిల్లాలో వరిసాగు పెరగడానికి కారణం. యాసంగిలో జిల్లాలో 90వేల ఎకరాల్లో వరిసాగు అవుతుందని జిల్లా వ్యవసాయాధికారి అంజిప్రసాద్ పేర్కొంటున్నారు. గ్రామాల్లో ఇప్పటికే 25వేల ఎకరాల్లో వరినాట్లు పూర్తి అయ్యాయని.. వారం రోజుల్లో మరింత జోరు అందుకుంటున్నాయని వ్యవసాయశాఖ అధికారులు తెలుపుతున్నారు.

ఉపాధి పొందుతున్న బిహార్ కూలీలు..

సాధారణంగా స్థానికంగా ఉండే మహిళా కూలీలే నాట్లు వేయడం ఆనవాయితీ. నాట్లు వేసే సమయం కావడంతో కూలీలకు డిమాండ్ ఏర్పడింది. ప్రస్తుతం బిహార్ వంటి ఉత్తరాది రాష్ట్రాల నుంచి వచ్చిన పురుషులు నాట్లు వేస్తున్నారు.

ఎకరాకు రూ.ఐదు వేలు

గత రెండేళ్లుగా బీహార్ నుంచి కూలీలు ఇక్కడకు వరినాట్ల సమయంలో వస్తూ ఉపాధి పొందుతున్నారు. వీళ్ల 10 నుంచి 15 మంది కలిసి ఒక గ్రూపుగా ఏర్పడి గుత్తలు పట్టుకొని నాట్లు వేస్తున్నారు. ఈసారి కూడా ఎకరాకు రూ.4800 నుంచి రూ.ఐదు వేల వరకు తీసుకుంటున్నారు. ఇప్పటికే లక్ష్మణచాంద మండలంలోని లక్ష్మణచాంద, పీచర, వడ్యాల్ గ్రామాల్లో ఎక్కువ శాతం బిహార్ కూలీలే నాట్లు వేస్తున్నారు. సంక్రాంతి పండుగ తర్వాత మరో రెండు, మూడు వారాల వరకు వరినాట్లు వేసే ప్రక్రియ సాగుతుందని రైతులు పేర్కొంటున్నారు.

నెలాఖరులో పూర్తి

జిల్లాలో సుమారు రైతులు 90వేల ఎకరాల్లో వరి సాగు చేస్తారని అంచనా వేస్తున్నాం. ఇప్పటికే 25వేల ఎకరాల్లో నాట్లు పూర్తి అయ్యాయి. నెలాఖరులోగా వరినాట్లు పూర్తయ్యే అవకాశం ఉంది. రైతులు వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు పాటించాలి.
– అంజిప్రసాద్, డీఏవో

మూడెకరాల్లో నాటు వేయించా



నాకు బోరు ఉండటంతో మూడెకరాల్లో వరినాట్లు వేయించా. నాట్ల సమయం కావడంతో కూలీలకు డిమాండ్ పెరిగింది. సాగునీటికి ఢోకా లేకపోవడంతో వానాకాలంలో మాదిరి సాగు చేశా. – గంగారాం, పొట్టపెల్లి(కె)

నాటుకు సిద్ధం చేసుకున్నా



నాకున్న రెండున్నర ఎకరాల్లో ఇప్పటికే ఎకరంన్నరలో వరి నాటు వేయించా. మరో రెండు రోజుల్లో మిగిలిన భూమిలో కూడా వరినాట్లు వేయించేలా పొలం దున్నించి, కూలీలను సిద్ధం చేసుకున్నాను. – ముత్యం, పీచర

యువత క్రీడల్లోనూ రాణించాలి

- ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్


లీగ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

పెంబి: ఆటలు ఆడటం ద్వారా శారీరక దారుఢ్యం, పోటీతత్వం పెరుగుతాయని.. యువత చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం పెంబి క్రికెట్ ప్రీమియర్ లీగ్(పీపీఎల్) పోటీలను ప్రారంభించి మాట్లాడారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గెలుపోటములు సహజమని.. క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. ఈ క్రికెట్ పోటీలు ఈనెల13వరకు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ గంగారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పుప్పాల శంకర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, ఎంపీటీసీ రామారావు, సర్పంచ్‌లు పూర్ణచందర్‌గౌడ్, సుధాకర్, సుదర్శన్, విలాస్, శంకర్, రమేశ్, పీపీఎల్ నిర్వాహకులు మతిన్, నరేశ్, మల్లేశ్, ఇస్మాయిల్, నర్సారెడ్డి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకురావాలి

- భైంసారూరల్ సీఐ చంద్రశేఖర్


సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న సీఐ చంద్రశేఖర్

భైంసారూరల్: నేరాల నియంత్రణలో ప్రధానపాత్ర పోషించే సీసీ కెమెరాల ఏర్పాటుకు దాతలు ముందుకు రావాలని భైంసారూరల్ సీఐ చంద్రశేఖర్ అన్నారు. సోమవారం మండలంలోని వాలేగాం గ్రామంలో దాతలు రూ.65వేలతో ఏర్పాటు చేసిన 13 సీసీ కెమెరాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. సీసీ కెమెరాలతో కేసులను ఛేదించడం సులువు అవుతుందన్నారు. అసాంఘిక కార్యకలాపాలు, రోడ్డు ప్రమాదాలు జరినప్పుడు నిందితులను గుర్తించే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అనసూయ పోతన్న, ఎంపీటీసీ మానిక్‌రావు, ఎస్సై శ్రీకాంత్, వీడీసీ సభ్యులు, పలువురు గ్రామస్తులు ఉన్నారు.

రోడ్లపై కేజీవీల్స్ నడుపొద్దు

నర్సాపూర్(జి): మండలంలోని బీటీ రోడ్లపై కేజీవీల్స్ ట్రాక్టర్లను నడుపవద్దని ఎస్ఐ పాకాల గీత ఒక ప్రకటనలో తెలిపారు. కేజీవీల్స్‌కు రబ్బరు తొడుగులు అమర్చుకొని, ప్రత్యేకంగా తయారు చేసిన ట్రాలీలలో మాత్రమే పొలాలకు తీసుకెళ్లాలని వారు సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే యజమానులు, డ్రైవర్లపై కేసు నమోదు చేసి ట్రాక్టర్లను సీజ్ చేస్తామని పేర్కొన్నారు.

సారంగాపూర్: కేజీవీల్స్ అమర్చిన ట్రాక్టర్లు రోడ్లపై తిప్పితే చర్యలు తప్పవని సారంగాపూర్ ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో రైతులు, ట్రాక్టర్ల యజమానులకు ఇప్పటికే సమాచారం ఇచ్చామని పేర్కొన్నారు. ట్రాక్టర్లకు పట్టీలు ఏర్పాటు చేయకుండా రోడ్లపై తిప్పితే ప్రభుత్వ ఆస్తుల విధ్వంస చట్టం కింద కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

నిబంధనలు ఉల్లంఘించిన ఇద్దరిపై కేసు

సారంగపూర్ మండలంలోని జామ్ గ్రామ శివారు ప్రాంతంలో రోడ్డుపై కేజీవీల్స్ ట్రాక్టర్ నడిపిన డ్రైవర్‌తోపాటు యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి పేర్కొన్నారు. వారి వెంట పలువురు పోలీస్ సిబ్బంది ఉన్నారు.

12 నుంచి క్రికెట్ పోటీలు

కడెం: మండలంలోని చిట్యాల్ గ్రామంలో ఈనెల 12 నుంచి క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కల్గిన క్రీడాకారులు రూ.1000 ఎంట్రీ ఫీజు చెల్లించి జట్టు పేరును నమోదు చేసుకోవాలన్నారు. విజేతకు రూ.20వేలు, రన్నరప్‌కు రూ.10వేలు అందిస్తామని రవి, రణధీర్, జమీల్, శేఖర్ పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 8897769415, 6302399869 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నర్సాగౌడ్‌కు సన్మానం

నిర్మల్‌చైన్‌గేట్: బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమితులైన నిర్మల్‌కు చెందిన అమరవేణి నర్సాగౌడ్‌ను బీజేపీ నాయకులు, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ హైదరాబాద్‌లోని నాంపల్లి బీజేపీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు సూదగానీ హరిశంకర్‌గౌడ్, ఓబీసీ మోర్చా నాయకులు దీపక్, రాగుల కిరణ్‌కుమార్‌గౌడ్, కిసాన్ మోర్చా నాయకులు జగన్ మోహన్‌రెడ్డి, సంజీవ్‌గౌడ్ పాల్గొన్నారు.

గెలుపోటములు సహజం

ఖానాపూర్: క్రీడల్లో గెలుపోటములు సహజమని.. యువత క్రీడాస్ఫూర్తి చాటాలని పెంబి జెడ్పీటీసీ జానుబాయి అన్నారు. సోమవారం మండలంలోని బావాపూర్(ఆర్)లో ప్రజాచైతన్య యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రీడా పోటీలను ప్రారంభించి మాట్లాడారు. ఈసందర్భంగా క్రీడల నిర్వహణకు తన వంతుగా రూ.ఐదు వేలు అందజేశారు. అంతకుముందు క్రికెట్ పోటీలను ఏబీసీ రీసెర్చ్ డిపార్ట్‌మెంట్ రాష్ట్ర కోఆర్డినేటర్ వినోద్‌నాయక్ ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో వినేశ్, హపావత్ రాజేందర్, నిమ్మానాయక్, గంగాధర్, మనోహర్, పవన్, శేఖర్, లాలూనాయక్, జవహర్, బిక్కు, సురేశ్, ఫకీర్‌సింగ్ పాల్గొన్నారు.

పరామర్శ

కడెం: మండలంలోని కన్నాపూర్ గ్రామానికి చెందిన గౌరై గంగన్న మృతి చెందగా సోమవారం బాధిత కుటుంబాన్ని పెంబి జెడ్పీటీసీ భూక్య జానుబాయి పరామర్శించారు. కార్యక్రమంలో రాజేందర్‌నాయక్, గంగాధర్, తిరుమలయ్య, తదితరులు ఉన్నారు.

అర్హులందరికీ 'డబుల్' ఇళ్లు ఇవ్వాలి


రోడ్డుపై బైఠాయించిన మోహన్‌రావు, నాయకులు

లోకేశ్వరం: అర్హులైన నిరుపేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించి ఇవ్వాలని ముధోల్ నియోజకవర్గ బీజేపీ నాయకులు బోస్లే మోహన్‌రావు పటేల్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని లక్ష్మి కల్యాణం మండపంలో మహాధర్నా సమావేశం నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వరకు దరఖాస్తుదారులతో కలసి ర్యాలీగా వెళ్లి లోకేశ్వరం–గడ్చాంద ప్రధాన రోడ్డుపై బైఠాయించారు. ఈమేరకు తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మోహన్‌రావు పటేల్ మాట్లాడారు. ఏళ్లు గడుస్తున్నా సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదన్నారు. వచ్చే ఎన్నిల్లో బీఆర్ఎస్‌కు ప్రజలే బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ముధోల్ తాలుకా పార్లమెంట్ కన్వీనర్ సాయినాథ్, కౌన్సిలర్లు దిలీప్, రవి, సాయినాథ్, ముధోల్ మాజీ ఎంపీపీ సుభాశ్‌పటేల్, లోకేశ్వరం మాజీ ఎంపీపీ పోతన్న, నారాయణ్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, నరహరి, అనిల్, భూమన్న, రాజన్న, హరీశ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ


పరామర్శిస్తున్న నాయకులు

లక్ష్మణచాంద: మండలంలోని పీచర గ్రామంలో ఇటీవల విద్యుత్ షాక్‌తో బొమ్మరేని సురేశ్, జిల్లా కేంద్రంలోని సబ్‌జైలులో రిమాండు ఖైదీగా ఉన్న కాల్వ సతీశ్ మృతి చెందాడు. దీంతో సోమవారం బాధిత కుటుంబసభ్యులను డీసీసీబీ వైస్ చైర్మన్ రఘునందన్‌రెడ్డి, మంత్రి సోదరుడు సురేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా కార్యదర్శి అడ్వాల రమేశ్, జెడ్పీటీసీ రాజేశ్వర్, ఎంపీటీసీ రాజేశ్వర్ పరామర్శించారు. ఈసందర్భంగా మంత్రి సోదరుడు సురేందర్‌రెడ్డి కాల్వ సతీశ్ కుటుంబానికి రూ.20వేలు ఆర్థికసాయం అందజేశారు. అండగా ఉంటామని.. అధైర్యపడొద్దన్నారు. వారి వెంట నాయకులు భూమేశ్, లస్మన్న, ముత్యం, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి నానూమహారాజ్ జాతర

సారంగపూర్: మండలంలోని బండ్రేవుతండాలో బంజారాల ఆరాధ్యదైవం నానూమహారాజ్ జాతర ఉత్సవాలు మంగళవారం నుంచి ఐదు రోజుల పాటు జరగనున్నాయి. ఈనేపథ్యంలో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఏటా సంక్రాంతి సందర్భంగా ఈ ఉత్సవాలు నిర్వహిస్తారు. 10న ప్రత్యేక పూజల అనంతరం జాతర ప్రారంభిస్తారు. క్రికెట్ పోటీలు, 11న వాలీబాల్, 12న జూనియర్ కబడ్డీ పోటీలు, 13న సీనియర్ విభాగంలో కబడ్డీ పోటీలు, 14న ప్రత్యేక పూజాది కార్యక్రమాలు, 15న కుస్తీ, స్లోసైకిల్ తదితర పోటీలను నిర్వహిస్తారు. ఐదురోజుల పాటు ఉదయం పూజలు, రాత్రి భజన నిర్వహిస్తామని నిర్వాహకులు దత్తురాం, ప్రకాశ్, నారాయణ తెలిపారు. చివరిరోజు 15న భక్తులకు అన్నదానం చేస్తామని పేర్కొన్నారు. ఆసక్తి కల్గిన క్రీడాకారులు ఎంట్రీ ఫీజు చెల్లించి పోటీల్లో పాల్గొనాలని సూచించారు.

అటెన్షన్ ప్లీజ్.. గుంతలతో అవస్థలు



భైంసారూరల్: మండలంలోని చుచుంద్ గ్రామంలో ప్రధానరోడ్డు గుంతలమయంగా మారింది. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులు అదుపుతప్పి ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.
ప్రశ్నించాల్సిన అధికారి: గోపాలకృష్ణారెడ్డి, భైంసా ఎంపీడీఓ, ఫోన్: 9908523064

ఫుడ్‌బ్యాంక్‌కు సాయం

లోకేశ్వరం: మండలంలోని బామ్నికే గ్రామానికి చెందిన నీరడి వాణిశ్రీ–సురేందర్ దంపతులు తమ కుమారుడు చైద్యాష్ మొదటి పుట్టినరోజు సందర్భంగా సోమవారం భైంసా ఫుడ్ బ్యాంక్‌కు రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. నిరుపేదలకు అన్నదానం చేసేందుకు సాయం అందించినట్లు మాఅమ్మ–నాన్న ఫౌండేషన్ చైర్మన్ ఆంజనేయులు తెలిపారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ

ఖానాపూర్: పట్టణంలోని ఇంద్రానగర్ కాలనీలో అయ్యప్ప మాలధారుడు మెంగు ప్రవీణ్ నివాసంలో సోమవారం పడిపూజ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ గురుస్వామి పిసుపాటి పాపారావు ఆధ్వర్యంలో చిన్నమెట్ల పూజ చేశారు. కార్యక్రమంలో తిలక్‌రావు సన్నిధాన స్వాములు, పలువురు భక్తులు పాల్గొన్నారు.

ఆలయంలో పూజలు

లక్ష్మణచాంద: మండలంలోని బాబాపూర్ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో సోమవారం బీజేపీ దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు రాచకొండ సాగర్ ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా అభిషేకం చేసి జిల్లా ప్రజలు సంతోషంగా ఉండాలని మొక్కుకున్నట్లు తెలిపారు. పూజారి గంగాధర్ శర్మ, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ లేఅవుట్లు ఏర్పాటు చేస్తే చర్యలు

ముధోల్: గ్రామాల్లో అనుమతుల్లేని లేఅవుట్లను ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటామని ఈవో పవన్ పేర్కొన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అనుమతి ఉన్న వాటిల్లోనే ప్లాట్లు కొనాలని ప్రజలకు సూచించారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

తానూరు: మధ్యాహ్న భోజనంలో పురుగులు వస్తున్నాయని విద్యార్థులు అర్ధకాలితో ఉంటున్నారని.. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించి వారు మంచిగా చదివేలా చూడాలని పోషకులు అన్నారు. సోమవారం మండలంలోని బోరిగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థుల పోషకులతో సమావేశం నిర్వహించారు. పోషకులు మాట్లాడుతూ సాంఘీకశాస్త్రం ఉపాధ్యాయుడి పోస్టు ఖాళీగా ఉందని సమావేశంలో పేర్కొన్నారు. ప్రైవేటు ఉపాధ్యాయుడ్ని నియమించాలని తాము మూడు నెలల వేతనం రూ.15 వేలు ఇస్తామని వైస్ ఎంపీపీ చంద్రకాంత్ అన్నారు. బోల్సా విద్యార్థులకు ఆటో ఖర్చులు సైతం భరిస్తామన్నారు. తాగునీటి కోసం ట్యాంక్ కొనుగోలు చేస్తామని గ్రామస్తులు పేర్కొన్నారు. కార్యక్రమంలో చంద్రకాంత్‌యాదవ్, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

రైతుబజార్‌లో..

కూరగాయలు	కిలో(రూ.లో)
టమాటా	10
వంకాయ	40
బెండకాయ	40
పచ్చిమిర్చి	40
కాకరకాయ	50
బీరకాయ	60
క్యారెట్	80
గోరుచిక్కుడు	60
కొత్తిమీర	100
అల్లం	50
ఎల్లిగడ్డ	50
ఉల్లిగడ్డ	25
ఆలుగడ్డ	30

– నిర్మల్‌టౌన్

సినిమాలు



తిరుమల : ధమాకా
నారాయణ : అవతార్
వెంకటేష్ : లాఠీ

సదస్సుకు హాజరైన బీజేపీ నాయకులు


సదస్సులో పాల్గొన్న జిల్లా నాయకులు

ఖానాపూర్: హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం జరిగిన డాటా సెల్ అవగాహన సదస్సుకు జిల్లా నాయకులు తరలివెళ్లారు. పార్టీ జిల్లా కన్వీనర్ కొరిపెల్లి శ్రావణ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఖానాపూర్‌కు చెందిన జాయింట్ కన్వీనర్ పుప్పాల ఉపేందర్ తదితరులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పార్టీ బలోపేతంలో భాగంగా అధిష్టానం చేపట్టే ప్రతీ కార్యక్రమానికి బాధ్యులు హాజరై ప్రజలు, కార్యకర్తలకు వివరించాలని పేర్కొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



మండలంలోని లింగాపూర్ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1989–90లో పదోతరగతి పూర్తి చేసిన పూర్వవిద్యార్థులు సోమవారం అక్కకొండ ఆలయం వద్ద ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా వారు ఒకరికొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని ఉల్లాసంగా గడిపారు. కార్యక్రమంలో లోక సంపత్‌రెడ్డి, పదాల వెంకటేశ్వర్‌రావు, గంగన్న, రవి, రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు. –కడెం

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నిర్మల్
90106 10882
99122 20764
Office mail : nzbadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
నిర్మల్ మరియు ముధోల్ : జి.గంగాధర్ - 7997958182
టోల్ ఫ్రీ నెం.: 1800 425 9899